# భారతదేశ చరిత్ర

## అలెగ్జాండర్ దండయాత్ర – ఫలితాలు

**అలెగ్జాండర్ గ్రీకు దేశంలోని మాసిడోనియా రాజు ఫిలిప్ కుమారుడు. గ్రీకు వేదాంతి అరిస్టాటిల్ శిష్యుడు. ప్రముఖ విజేతలైన హెర్క్యులస్, సైరస్‌ల మాదిరి గొప్ప విజేత, సామ్రాజ్యాధినేత కావాలన్నది అలెగ్జాండర్ ఆశయం. క్రీపూ. 336లో తండ్రి ఫిలిప్ మరణానంతరం 20 సంవత్సరాల యుక్త వయసులో సింహాసనం అధిష్టించాడు. పటిష్ఠమైన సైన్యాన్ని ఏర్పాటు చేసుకుని గ్రీకు, పర్షియా, ఈజిప్ట్, ఆసియా మైనర్ లాంటి ప్రాంతాలను జయించాడు.**

అలెగ్జాండర్ క్రీ.పూ. 334-330 మధ్య కాలంలో పర్షియాతో యుద్ధాలు చేశాడు. అప్పటి పర్షియా రాజు డేరియస్ బలహీనుడు. యుద్ధంలో నేర్పరి కూడా కాకపోవడంతో అలెగ్జాండర్ పురోగమనాన్ని అడ్డుకోలేకపోయాడు. ఆసియా మైనర్, సిరియా, ఈజిప్ట్‌లను ఆక్రమించి క్రీ.పూ. 331 లో అర్బేలా యుద్ధంలో డేరియస్‌ను ఓడించాడు. అలెగ్జాండర్ పెర్సిపోలిస్ నగరాన్ని ధ్వంసం చేశాడు.

★ తన విజయాలకు చిహ్నంగా అలెగ్జాండ్రియా అనే పట్టణాన్ని నిర్మించాడు. పర్షియా పరిసర ప్రాంతాలన్నిటినీ ఆక్రమించి, అఫ్గనిస్థాన్, బాక్ట్రియాలను కూడా ఓడించి 'ఘనత వహించిన పర్షియా చక్రవర్తి' అనే బిరుదు స్వీకరించాడు.

### *భారతదేశంపై దండయాత్ర (క్రీ.పూ. 327):*

అలెగ్జాండర్ భారతదేశంపై చేసిన దండయాత్ర వివరాలను తెలుసుకోవడానికి గ్రీకు రచనలే ఆధారం. ఈ రచయితల్లో కొందరు అలెగ్జాండర్‌తో వచ్చినవారైతే, మరికొందరు అతడి సమకాలీకులు. అలెగ్జాండర్ తర్వాత అతడి దండయాత్రపై అనేక రచనలు వెలువడ్డాయి.

★ ఏరియన్ కర్టియస్ తను రాసిన 'అనాబాసిస్ ఆఫ్ అలెగ్జాండర్' అనే గ్రంథంలో ఈ దండయాత్రను ఘనమైన విజయంగా వర్ణించాడు.

★ బనిస్క్రిటిస్ అనే రచయిత అలెగ్జాండర్ జీవితచరిత్ర రచించాడు.

★ అలెగ్జాండర్‌తోపాటు భారతదేశానికి వచ్చిన గ్రీకు శాస్త్రవేత్తలు, తత్త్వవేత్తలు, సైనికాధికారులు కూడా అలెగ్జాండర్ చేసిన ప్రతి యుద్ధాన్ని వివరణాత్మకంగా వర్ణించారు.

### *అలెగ్జాండర్ దండయాత్రకు కారణాలు:*

అలెగ్జాండర్‌కు సామ్రాజ్య విస్తరణకాంక్ష అధికం. ప్రపంచమంతా జయించి, విశ్వ విజేత కావాలనేది అతని ఆశయం. దానికి అవసరమైన చొరవ, సాహసం, ధైర్యం అతడికి అపారంగా ఉండటంతో దండయాత్రకు సిద్ధమయ్యాడు.

★ తూర్పు, పశ్చిమ దేశాలతో సాగుతున్న వ్యాపారాన్ని సురక్షితం చేయాలనేది అలెగ్జాండర్ అభిలాష.

★ భారతదేశంలోని ప్రకృతి వనరులు, సిరిసంపదలు దోచుకోవాలనే కోరిక కూడా దండయాత్రకు ముఖ్య కారణం.

★ పర్షియా సామ్రాజ్యంలో అత్యంత సుసంపన్నమైన రాష్ట్రంగా పేరుగాంచిన వాయవ్య భారతదేశాన్ని జయించకపోతే తన పర్షియా సామ్రాజ్య విజయం పరిపూర్ణం కాదని అలెగ్జాండర్ భావించాడు.

★ గ్రీకు దేశ ప్రతినిధిగా, గ్రీకు నాగరికతను తూర్పు దేశాలకు వ్యాపింపజేయడం తన ప్రధాన లక్ష్యంగా నిర్ణయించుకున్నాడు.

★ అలెగ్జాండర్ నాటి ప్రముఖ గ్రీకు తత్త్వవేత్త అరిస్టాటిల్ శిష్యరికంలో అనేక వినూత్న భావాలను సంతరించుకున్నాడు. ప్రపంచంలోని గొప్ప వీరుల్లా సాహసకృత్యాలు చేయాలని, విశ్వవిజేతగా ఘనకీర్తి పొందాలనే కోరిక వల్ల భారతదేశంపై దండయాత్రకు సిద్ధమయ్యాడు.

### హైడాస్పస్ యుద్ధం (క్రీపూ. 326)

ఈ యుద్ధానికి మరో పేరు 'జీలం' యుద్ధం. జీలం - చినాబ్‌ల మధ్య ఉన్న పోరస్ రాజ్యంపై క్రీ.పూ. 326 లో అలెగ్జాండర్ దాడి చేశాడు. ఈ సమయంలో తక్షశిల రాజైన అంభి అలెగ్జాండర్‌కు స్వాగతం పలికాడు. జీలం నది అవతల పంజాబ్ రాజ్యం ఉండేది. ఈ రాజ్యానికి రాజు పురుషోత్తముడు. పురుషోత్తముడికి, అలెగ్జాండర్‌కు స్వాగతం పలికిన అంభికి మధ్య శత్రుత్వం ఉండేది. పురుషోత్త ముడి మీద పగ తీర్చుకోవడానికే అంభి అలెగ్జాండర్‌తో రాజీపడి, లొంగిపోయాడు.

★ అలెగ్జాండర్ సైనికులు జీలం నదిని దాటి పురుషోత్తముడి సేనలతో తలపడ్డారు. ఈ యుద్ధాన్నే హైడాస్పస్ యుద్ధం అంటారు. ఈ భీకర యుద్ధంలో చివరకు అలెగ్జాండర్ గెలిచాడు. పురుషోత్తముడిని బందీగా పట్టుకుని తన ముందు తల వంచమని ఆదేశించాడు. పౌరుషానికి మారుపేరైన పురుషోత్తముడు అందుకు అంగీకరించలేదు. అలెగ్జాండర్ అతడి ధైర్యసాహసాలను మెచ్చుకుని అతడి రాజ్యాన్ని అతడికే ఇచ్చేశాడు.



R-28-05-16

★ ఆ తర్వాత అలెగ్జాండర్ కొన్ని చిన్న రాజ్యాలను, గణ రాజ్యాలను కూడా జయించాడు. అయితే వరుస యుద్ధాలతో అతడి సైనికుల్లో అసంతృప్తి రగిలింది. చివరికది అలెగ్జాండర్ ఆదేశాన్ని ధిక్కరించే స్థితికి చేరుకుంది. దాడులకు స్వస్తి చెప్పి స్వదేశం బయలుదేరాలని సైనికులు చేసిన సూచనను అలెగ్జాండర్ అంగీకరించి స్వదేశానికి వెనుదిరిగాడు. దారి మధ్యలో జ్వరపీడితుడైన అలెగ్జాండర్ క్రీ.పూ. 323 లో బాబిలోనియాలో కన్నుమూశాడు.

### భారతీయుల ఓటమికి కారణాలు:

అలెగ్జాండర్ భారతదేశం మీద దండెత్తే నాటికి వాయవ్య భారతదేశంలో అనేక చిన్న రాజ్యాలు ఉండేవి. వీటిలో కొన్ని గణ తంత్ర, మరికొన్ని స్వతంత్ర రాజ్యాలు. ఈ రాజ్యాల మధ్య నిరంతరం యుద్ధాలు, శత్రుత్వాలు ఉండేవి. వీరు పరస్పర అసూయ, ద్వేషాల వల్ల సమైక్యంగా విదేశీ శత్రువులను ఎదుర్కోలేకపోయారు.

★ సంఖ్యాబలం అధికంగా ఉన్నప్పటికీ విదేశీ సైనికుల యుద్ధ నైపుణ్యం, వ్యూహ రచన, క్రమశిక్షణ భారతీయుల ఓటమికి కారణమయ్యాయి. భారతీయ సైనికులకు సరైన నాయకత్వం లేకపోవడం కూడా ఒక కారణమే.

★ పంజాబ్ ప్రాంతంలోని చిన్నచిన్న తెగలకు చెందిన రాజ్యాలు తెగువ, ధైర్యసాహసాలతో పోరాడినప్పటికీ, వారికి తగిన వ్యూహ రచన, యుద్ధతంత్ర నిర్వహణ లోపించడంతో ఓటమి పొందక తప్పలేదు. తెగల రాజ్యాల వారికి సంఘటితమైన సైనిక వ్యవస్థ లేకపోవడం వల్ల ఎవరికి వారే అన్నట్లు శత్రువులను ఎదుర్కొని ఓటమి పాలయ్యారు.

★ వాయవ్య భారతదేశంలోని రాజ్యాలు, గణతంత్ర రాజ్యాల పాలకుల్లో సమష్టిగా వ్యవహరించాలనే భావన లేదు. మాతృదేశాన్ని విదేశీయుల దాడి నుంచి కాపాడాలనే ఉద్దేశం కొరవడింది.

★ భారతీయుల ఓటమికి సైనిక వ్యవస్థలో లోపాలు ప్రధాన కారణంగా కనిపిస్తాయి. భారతీయ సైన్యాలు యుద్ధ నిర్వహణలో గజ దళాలకు ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చాయి. గ్రీకుల అశ్విక దళం మెరుపు దాడుల నిర్వహణలో చురుకుగా పనిచేస్తూ గజ సైన్యాలను చికాకుపరిచింది. అందువల్ల భారతీయ సైనిక దళంలో చురుకుదనం లోపించి, శత్రువుల వ్యూహాలను ఛేదించలేకపోయారు. ఇది గ్రీకు సైనికుల విజయాన్ని సులభం చేసింది.

★ గ్రీకులు వినియోగించిన ఆయుధాలు, విల్లంబులు తేలికగా ఉండేవి. భారతీయ సైనికుల ఆయుధాలు, విల్లంబులు పరిమాణంలో పెద్దవిగా, బరువుగా ఉండటం కూడా ఒక ప్రధాన లోపంగా పేర్కొనవచ్చు.

★ గ్రీకు సైనికులు అనుభవజ్ఞులు. యుద్ధనైపుణ్యం ఉన్న సైనికాధికారులు నాయకత్వం వహించారు. ముఖ్యంగా అలెగ్జాండర్ స్వయంగా యుద్ధాల్లో పాల్గొని, సైనికులకు నాయకత్వం వహించి, విజయమే తన ఆశయంగా, దైవనిర్ణయంగా ప్రకటించేవాడు. ఇది సైన్యంలో మానసిక, నైతిక స్థైర్యం కలిగించి, వారి విజయానికి ముఖ్య కారణమైంది.

**క్రీ.పూ. 6వ శతాబ్దంలో ఉన్న షోడశ మహా జనపదాలు - వాటి రాజధానులు**

| మహా జనపదం | | రాజధాని |
|---|---|---|
| 1. అంగ రాజ్యం | - | చంపానగర్ |
| 2. అస్సక (లేదా) అశ్మక | - | పోతన్(బోధన్) |
| 3. అవంతి | - | ఉజ్జయిని |
| 4. చేది | - | శుక్తిమతి |
| 5. గాంధార | - | తక్షశిల |
| 6. కాశి | - | వారణాసి |
| 7. కోసల | - | శ్రావస్తి |
| 8. కాంభోజ | - | రాజపురం |
| 9. కురు | - | ఇంద్రప్రస్థం |
| 10. పాంచాల | - | అహిచ్ఛత్ర (కపిలవస్తు) |
| 11. మత్స్య | - | విరాట్ నగరం |
| 12. మగధ | - | రాజగృహ |
| 13. మల్ల | - | కుశి నగరం, పావ |
| 14. శూరసేన | - | మధురా నగరం |
| 15. వత్స | - | కోశాంబి |
| 16. వజ్జి | - | వైశాలి |

**అలెగ్జాండర్ దండయాత్ర ఫలితాలు**

అలెగ్జాండర్ దండయాత్ర వల్ల నూతన భౌగోళిక మార్గాల అన్వేషణకు అవకాశం ఏర్పడింది. ఫలితంగా ప్రాచీన యూరప్, ప్రాచీన భారత దేశాల మధ్య సన్నిహిత సంబంధాలకు మార్గం ఏర్పడింది.

★ భారతదేశానికి, పశ్చిమ దేశాలకు మధ్య సముద్రయానాలు, భూతల మార్గయానాలు ప్రారంభమయ్యాయి.

★ గ్రీకు రచనల ఆధారంగా చంద్రగుప్త మౌర్యుడు అలెగ్జాండర్ సమకాలీకుడని తెలుస్తోంది. గ్రీకు పర్యటకుల రచనలు భారతదేశ చరిత్ర రచనకు తోడ్పడ్డాయి.

★ భారతదేశంలో రంగస్థలం, శిల్పం, ఖగోళ శాస్త్రం లాంటివి అభివృద్ధి చెందాయి.

★ గ్రీకులతో సంబంధాల వల్ల భారతదేశంలో నాణేల ముద్రణ స్థాయి పెరిగింది.

★ భారతీయ, గ్రీకు శిల్ప రీతుల సమ్మేళనంతో గాంధారశైలి అనే ఒక నూతన శిల్ప శైలి ఆవిర్భవించింది.

**- సి. రామాంజులు**